తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## శ్రీ చెంగాళమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం చివరి శుక్ర వారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ప్రధానికి స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరై భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఈ వ్రతానికి చిట్టేటి పెరుమాళ్ళు గోవిందమ్మ దంపతులు కర్లపూడి సురేష్ బాబు దంపతులు, ఏ భాస్కరాచారి దంపతులు, దర్శి శ్రీనివాసరావు దంపతులు ఉభయకర్తలగా వ్యవహరించారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీ చెంగాళమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు తిరుమూరు సుధాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, పోలూరు సుబ్రహ్మణ్యం, పామూరు మునుస్వామి, అలవల శ్రీనివాసరావు, పిట్ల సుహాసిని, పచ్చ మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హరేకృష్ణకృష్ణ ...హరేహరే!

### -వేడుకగా గోకులాష్టమి పూజలు

తిరుమల, సెప్టెంబర్ 4ప్రభాతవార్త ప్రతినిధి:



తిరుమలకొండపై శుక్రవారం హరేకృష్ణకృష్ణ ...హరేహరే నామం వినిపించింది. గోకులాష్టమి పర్వదినం సందర్భంగా గోగర్భం డ్యామ్ చెంతగల ఉద్యానవనంలో కాళీయ మర్ధనుడు శ్రీకృష్ణునికి ఉదయం పంచాభిషేకాలు చేశారు. అనంతరం ఉట్లోత్సవం నిర్వహించారు. ఆ తరువాత ప్రసాద వితరణ జరిగింది. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాత్రి 8 నుండి 9గంటల నడుమ శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ అధికారులు,అర్చకులు పాల్గొన్నారు.

## ఏడుకొండలే...ఏడు స్వర్గాలై...

### దేవుని బ్రహ్మోత్సవాలకు తిరుమల దేదీప్యం



కలియుగవైకుంఠం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ముల్లోకాల్లో దేవతలను ఆహ్వానించేలా భక్తజనులను ఆకట్టుకునేలా ఏడుకొండలు ముస్తాబయ్యాయి. ఆలయం పై భాగంలో పరిసరాల్లో కనులకాంతులీనేలా విద్యుత్ వెలుగులు విరాజిల్లుతున్నాయి. ప్రభాతవార్త-తిరుమల

## జిఎస్ఎల్వీఎఫ్ 17

# ప్రయోగం సక్సెస్

### - కక్షలోకి ఈఓఎస్ 05



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

ఇస్రో జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ద్వారా ఈవోఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశించిన కక్షలోకి ప్రవేశపెట్టి తన సత్తా చాటింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి శుక్రవారం వేకువ జామున పిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ చీకట్లను చీల్చుకుంటూ నిప్పులు చెరుగుతూ నింగికేగిసింది. బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్ డౌన్ 27 గంటల 30 నిమిషాల పాటు కొనసాగిభారత కాలమాన ప్రకారం రెండు గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్వీఎఫ్ 17 రాకెట్ ఈవోఎస్ 05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని జియో సింక్రోనెస్ ఆర్బిట్లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన రాకెట్ గమన 19 నిమిషాల సమయాన్ని ఆశించిన రీతిలో పూర్తి చేసింది. 51.70 మీటర్ల పొడవు, 2,367 టన్నుల బరువు గల ఈ రాకెట్ మొదటి దశలో నాలుగు ద్రవ ఇంధన స్ట్రాప్న్ బూస్టర్ల సాయంతో నింగికెగిసి 40 టన్నుల ద్రవ ఇంధనంతో మొత్తం 160 టన్నుల ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 151.2 సెకండ్లలో పూర్తి చేసింది. 420.5 రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహానికి అమర్చిన హిట్ షీట్స్ మొదటి దశ రెండో దశకు మధ్యలోనే శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం విడిపోయాయి. 40 టన్నుల ద్రవైందన సహాయంతో రెండో దశను 293.08సెకండ్లలో అధికమించింది. స్వదేశీ సాంకేతికతో రూపొందించిన 15 టన్నుల క్రయోజనిక్ సహాయంతో 1106.60 సెకండ్ల మూడవ దశను విజయవంతంగా పూర్తి చేసుకుంది.

### ఈ ఏడాదిలో ఆరు ప్రయోగాలు :- ఇస్రో చైర్మన్



ప్రయోగ విజయానంతరం శ్రీహరికోటలోని మీడియా సెంటర్లో ఇస్రో చైర్మన్ వి .నారాయణన్ విలేకరులతో మాట్లాడారు. పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ద్వారా భారతదేశానికి అత్యంత ఉపయోగకరమైన ఈఓ ఎస్ 05 రాకెట్ను నిర్దేశించిన కక్షలోకి పంపగలిగామన్నారు. జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ప్రథమంగా అధిక బరువు గల ఉపగ్రహాన్ని గగనతలంలోకి తీసుకువెళ్లిందని తెలిపారు. 36 వేల కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపగ్రహం చేరుకొని పనిచేయడం ప్రారంభించిందని ఇస్రో ఆధ్వర్యంలో ఇంత ఎత్తులో ప్రవేశ పెట్టడం ప్రథమన్నారు. అలాగే ప్రైవేటు సెక్టార్కు సంబంధించి విక్రమ్ వన్ రాకెట్ విజయం సాధించిందని తెలిపారు. ఈ ఏడాదిలో ఆరు ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. తమిళనాడులోని కులశేఖర పట్టణంలోని లాంచ్ ప్యాడ్లో ఇస్రో, ప్రైవేట్ సంస్థలకు చెందిన రాకెట్ ప్రయోగాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణం కీలక దశలో ఉందని నారాయణన్ తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తల బృందంతో కలిసి పిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ నమూనాను చేత పట్టుకొని విజయోత్సవం జరుపుకున్నారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ముత్తు చెళియన్, ఐపిఆర్సి డైరెక్టర్ నారాయణ అప్పు, ఇస్రాక్ డైరెక్టర్ ఎంఆర్ రాఘవేంద్ర, మాస్టర్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ పంకజ్ దామోదర్ కిల్ డార్, విఎస్ఎస్సి డైరెక్టర్ డాక్టర్ రాజీవ్, యుఆర్ ఎస్సీ డైరెక్టర్ దినేష్ కుమార్ సింగ్, మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్, డాక్టర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

### -గోశాలలో వైభవంగా గోపూజ





కాణిపాకం,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. గోశాలలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యామానికి కాణిపాకంకు చెందిన ధనంజయ యాదవ్,దేవరాజులు యాదవ్, రేణుగోపాల్ యాదవ్, రాజేంద్ర యాదవ్లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవ ఉభయదారులు,ఆలయ అధికారులు ఉదయం ప్రధాన ఆలయం నుండి పూజాసామాగ్రిని గోశాలకు తీసుకు వచ్చారు. అనంతరం గోశాల వద్ద శ్రీకృష్ణుని చిత్రపటంతో పాటు గోమాత చిత్రపటాన్ని వుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలోని గోమాతలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతలకు ఈఓ దంపతులు ఆలయ అధికారులతో కలసి మేతను అందించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ ధనుంజయ, సూపరెండెంట్లు వాసు, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. గోకులాష్టమి సందర్భంగా కాణిపాకం దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ఉట్ల పండుగలో స్థానిక యువకులు, ఉత్సవ ఉభయదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంంతరం యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమంలోఉత్సాహంగా పాల్గొని ఉట్టికొట్టారు.

## షార్లో సంబరాలు

### - వర్షాన్ని సైతం లెక్కచేయని సందర్శకులు...



జిఎస్ఎల్వీఎఫ్ 17 విజయవంతం కావడంతో షార్లో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఒక పక్క శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్లో శాస్త్రవేత్తలు, మాజీ ఇస్రో చైర్మన్లు కరతళ ధ్వానులతో ఒకరినొకరు అలింగం చేసుకుంటూ ఆనందోత్సాహాలు పంచుకొన్నారు. మూడు దశల్లో జరిగిన ఈ ప్రయోగంలో ఒక్కొక్క దశ పూర్తవుతుండగా సంబరాలు చేసుకున్నారు. ప్రయోగం పూర్తయ్య వరకు ఉత్కంఠత ఉన్న శాస్త్రవేత్తలు ఉపగ్రహం నిర్దేశించిన కక్షలోకి చేరిన వెంటనే భావోద్వేగానికి గురయ్యారు. మరోవైపు అర్ధరాత్రిలో సైతం ప్రయోగాన్ని వీక్షించేందుకు విజిటర్స్ గ్యాలరీకి చేరుకున్న విద్యార్థులు, సందర్శకులు ఒకవైపు భారీ వర్షం కురుస్తున్న దాని లెక్కచేయకుండా భారతదేశ జాతీయ జెండాను ఎగురవేస్తూ జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. శ్రీహరికోటలోని ఉద్యోగులు ఒకరినొకరు అభినందించుకుంటూ స్వీట్స్ పంచి పెట్టారు.

# అందరి చూపు...! మేయర్ కుర్చీ రిజర్వేషన్ వైపు...!

### ఆర్థికంగా పరిపుష్టి వున్న అభ్యర్థి కోసం పార్టీల అన్వేషణ

చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం అవుతుండటంతో అందరి చూపు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కుర్చీపై కేంద్రీకృతమైంది. గతంలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల తరహాలో కాకుండా ప్రస్తుతం జరుగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు జరుగనుండటంతో ఇటు అధికార, అటు ప్రతిపక్ష పార్టీల నుండి మేయర్ అభ్యర్థులుగా ఎవరెవరు ఎన్నికల బరిలో నిలుస్తారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆవిర్భావించినప్పటి నుండి మేయర్ పదవికి ఇప్పటి వరకు రెండుసార్లు ఎన్నికలు జరిగితే ఈ రెండు ఎన్నికల్లోను మేయర్లను కార్పొరేటర్లు పరోక్ష పద్ధతిలో ఎన్నుకున్నారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, ఛైర్మన్ పదవులకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో చిత్తూరు మున్సిపల్ మేయర్ పదవికి ప్రత్యక్ష పదవిలో ఎన్నికల బరిలో నిలిచేది ఎవరనే విషయంపై రాజకీయ పార్టీలు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. చిత్తూరు మున్సిపల్ మేయర్ పదవికి మొదటి సారిగా 2014 సంవత్సరంలో పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మేయర్ పదవి బిసీ మహిళలకు రిజర్వ్ అయ్యింది. ఈ ఎన్నికల్లో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంగనపల్లి నుండి కార్పొరేటర్గా కఠారి అనురాధ ఎన్నికయ్యారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మెజార్టీ కార్పొరేటర్ల స్థానాలు తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడంతో 33వ డివిజన్ నుండి కార్పొరేటర్గా ఎన్నికైన కఠారి అనురాధను తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్లు అందరు కలిసి పరోక్ష పద్ధతిలో మేయర్గా ఎన్నుకున్నారు. తదనంతర పరిణామాల్లో మేయర్ కఠారి అనురాధ దంపతులు హత్యకు గురి కావడంతో ఆమె కోడలు కఠారి హేమలత సైతం గంగనపల్లి నుండి కార్పొరేటర్గా ఎన్నికై పరోక్ష పద్ధతిలో మేయర్గా ఎన్నికయ్యారు. అనంతరం రెండవ సారి మేయర్ కుర్చీకి 2021 సంవత్సరంలో ఎన్నికలు జరిగితే ఈ ఎన్నికల్లో మేయర్ కుర్చీ ఎస్సీ జనరల్కు రిజర్వ్ అయ్యింది. ఈ ఎన్నికల్లో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద హరిజనవాడ నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన కుమారి అముద కార్పొరేటర్గా ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు తమ మేయర్గా 39వ డివిజన్ నుండి ఎన్నికైన కుమారి అముదను ఎన్నుకున్నారు. ఆపై 2024లో సార్వత్రిక ఎన్నికలు జరుగగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, అప్పటి వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ తరపున మేయర్గా వున్న కుమారి అముద ఆ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకుని తెలుగుదేశం పార్టీ మేయర్ అయ్యారు. ప్రస్తుతం మేయర్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు జరుగనుండటంతో మేయర్ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచే వారందరు పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేయాల్సి వుంటుంది. మేయర్ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలపడానికి ఆర్థికంగా బలం వున్న అభ్యర్థుల కోసం రాజకీయ పార్టీలు అన్వేషిస్తున్నాయి. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆవిర్భావించిన అనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో మేయర్ పదవులు బిసీ మహిళ, ఎస్సీ జనరల్కు రిజర్వ్ అయ్యాయి. ఈ మేరకు ప్రస్తుతం జరుగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనరల్, జనరల్ మహిళ, బిసీ జనరల్, ఎస్సీ మహిళల్లో ఏ వర్గానికైనా మేయర్ కుర్చీ రిజర్వ్ అయ్యే అవకాశం వుంది. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలో వుండటంతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం జెండాను ఎగురవేయాలని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్నాయుడు పక్కా వ్యూహంలో అడుగులు వేస్తున్నారు. మరోవైపు గత ఎన్నికల్లో రాష్ట్రంలో అప్పుడు అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున కార్పొరేటర్ల స్థానాలను ఏకగ్రీవం చేసుకుని మేయర్ పదవికి కైవసం చేసుకుంది. ప్రస్తుతం మేయర్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు జరుగనుండటంతో నగర పరిధిలోని ఓటర్లు అందరు మేయర్ అభ్యర్థులకు ఓటు వేయాల్సి వుండటంతో మేయర్ పదవి ఏకగ్రీవం అయ్యే అవకాశం తక్కువ. ఈ పరిస్థితుల్లో మేయర్ కుర్చీ ఏ వర్గానికి రిజర్వేషన్ అవుతుందనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మేయర్ కుర్చీ జనరల్ అభ్యర్థికి కేటాయిస్తే అధికార తెలుగుదేశం పార్టీ తరపున కాజూరు బాలాజీ పోటీ చేయడానికి రంగం సిద్ధం అవుతుంది. ఈ మేరకు ఆయన ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి వెళ్ళే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే జనరల్ మహిళకు మేయర్ ఖరారు అయితే మాజీ ఎమ్మెల్సీ సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు మేయర్ అభ్యర్థిగా వుంటారని విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. మరోవైపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున సైతం మేయర్ అభ్యర్థి జనరల్ లేదా జనరల్ మహిళకు రిజర్వ్ అయితే ప్రస్తుత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎంసి విజయానందరెడ్డి సతీమణి మేయర్ అభ్యర్థిగా రంగంలో వుండేలా ఆ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకునేలా వుందని పేర్కొంటున్నారు. అలాగే మేయర్ పదవి బిసీ జనరల్కు కేటాయిస్తే తెలుగుదేశం పార్టీ నుండి సీనియర్ తెలుగు దేశం నాయకులు రావూరి ఈశ్వర్రావు ఎన్నికల బరిలో వుండే అవకాశం కన్పిస్తుంది. అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, బిసీ నాయకులు జ్ఞాన జగదీష్లు మేయర్ కుర్చీ కోసం బరిలో నిలిచే అవకాశం కన్పిస్తుంది. ఏది ఎమైనా మేయర్ కుర్చీ రిజర్వేషన్ ఖరారైతే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ కుర్చీ కోసం ఎవరు పోటీ పడతారనే విషయంపై స్పష్టత రానుంది.

### అంకితభావ బోధన సేవలకు....

# పద్మావతి వర్సిటీ ఆచార్యులకు ఉత్తమ పురస్కారాలు



తిరుపతి,సెప్టెంబర్ 4ప్రభాతవార్త:

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో అంకితభావసేవలందిస్తున్న కొందరు ఆచార్యులకు రాష్ట్ర ""ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు"లభించాయి. ఈ అవార్డులు అందుకోనున్న వారిలో మాజీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని, ఆచార్య ఐ.లలితకుమారి, ఆచార్య వి.నిర్మల, ఆచార్య కుమారి ఉన్నారు. వీరిని రాష్ట్రప్రభుత్వం ఎంపికచేసింది. శనివారం జరిగే కార్యక్రమంలో రాష్టమంత్రి నారాలోకేశ్ నుండి నలుగురు ఆచార్యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్నారు. ఆచార్య రజని పద్మావతి వర్సిటీలో గృహ విజ్ఞాన శాస్త్ర విభాగంలో 22 సంవత్సరాల అనుభవం కలిగిన సీనియర్ విద్యావేత్త ,పరిపాలకురాలు. గృహ విజ్ఞాన విస్తరణ విద్య, పారిశ్రామికవేత్తల అభివృద్ధి, సమాజ ఆరోగ్యం పోషకాహారంలో ప్రత్యేకత కలిగి ఉన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలన, విద్యా నాయకత్వం, పరిశోధన, విస్తరణ అంతరశాఖా కార్యక్రమాల సమన్వయంలో అనుభవం కలిగి ఉన్నారు.ఇక సాంఘిక కార్య విభాగంలో ఆచార్య ఐ. వి. లలిత కుమారి 33 సంవత్సరాల బోధన పరిశోధన అనుభవం ఉంది. రెండు పరిశోధన ప్రాజెక్టులను పూర్తి చేశారు. జాతీయ అంతర్జాతీయ జర్నల్స్లో 35 పరిశోధన వ్యాసాలను, 12 పుస్తకాలను ప్రచురించారు. పీర్ రివ్యూడ్ అంతర్జాతీయ జర్నల్స్కు సంపాదకవర్గ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆంగ్ల భాష, సాహిత్య విభాగంలో ఆచార్య డాక్టర్ వి. నిర్మల బోధన, పరిశోధన రంగాల్లో విశేష సేవలందిస్తున్నారు. 24 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం కలిగిన ఆమె విద్యా, పరిశోధనా రంగాల్లో తనదైన ముద్ర వేశారు. ఆచార్య కుమారి అనువర్తిత సూక్ష్మవిభాగంలో విద్యాబోధన, పరిశోధన, విద్యాపరిపాలన రంగాల్లో అంకిత భావసేవలందిస్తున్నారు. యుజిసి సిఎస్ఐఆర్ నెట్ అర్హత సాధించి 24 సంవత్సరాలుగా పరిశోధన అనుబవం ఉంది. పరిశోధనా రంగంలో ఆమె 44 అంతర్జాతీయ పరిశోధనా పత్రాలను ప్రచురించడంతో పాటు 15 పుస్తక అధ్యాయాలు, 8 పుస్తకాలను రచించారు. 7 పేటెంట్లు ప్రచురించబడ్డాయి.






## కులాల వారీగా ఓటర్ జాబితా పరిశీలించాలి

పెనగలూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



పెనగలూరు మండలంలో ఎస్సి, ఎస్టీ, బీసీల కులాల వారీగా అధికారులు సిద్ధం చేసిన ఓటర్ జాబితాను ప్రజలు పరిశీలించాలని ఎంపీడీవో మోహన్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారంరెడ్డి శివయ్య, మారంరెడ్డి నరసింహులు, మదన్, మహేష్, పంచాయతీ కార్యదర్సులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖాదర్ పేటలో టిడిపి డోర్ టు డోర్ కార్యక్రమం

పుల్లంపేట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



మండల పరిధిలోని గారాల మడుగు పంచా యతీలోని ఖాదర్ పేట గ్రామంలో శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటిస్తూ ఇం టింటికి తిరిగి గ్రామంలోని సమస్యలను తెలు సుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామంలోని ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో గారాల మడుగు మాజీ సర్పంచ్ షేక్ మహమ్మద్ అలీ, పోలి రామచంద్రారెడ్డి, మహమ్మద్ ముస్తఫా, ఆయుబ్, మహబునిస, ఇమాంబి,ఫాతిమా, బాలరాజు శివకుమార్ రాజు, ముని కుమార్ రాజు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

రైల్వే కోడూరు రూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :



మండలంలోని మైసూరువారిపల్లి పంచాయతీ వేణుగోపాల్ నగర్లో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి జన్మదిన వేడుకలను వైభవంగా చైర్మన్ వెంకటయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య యాదవ్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భారీ ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. వందలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో వేణుగోపాలస్వామిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకరయ్య, కృష్ణయ్య, బత్తిన గంగయ్య యాదవ్, నరసింహులు, గురు శంకర్, నాగేశ్వరరావు తోపాటు మండల పరిధిలో ఉన్న భక్తులు ఆలయంలో స్వామివారి తీర్థప్రసాదాలను అందుకున్నారు.

## వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

చిట్వేలి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:



రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, స్థానిక ఎస్ఐ ఎస్.వినోద్ కుమార్ శుక్రవారం పరి శీలించారు. జిల్లా ఎస్పీ సుబ్బ రా యుడు ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణ లో వారు చిట్వేలి మండలంలోని యల్లమరాజు చెరువును సందర్శించారు.చిట్వేలి మండలంతో పాటు పెనగలూరు మండలంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 100 వరకు వినాయక విగ్రహాలను ఈ చెరువులో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వాహనాలు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగినంత లైటింగ్, బారికేడింగ్, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. అలాగే చెరువులోని పిచ్చి మొక్కలు, వ్యర్థాలు, ఇతర అవరోధాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, అత్యవసర పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షి తంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేలా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా, సురక్షి తంగా నిర్వహించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, ఫైర్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని సమిష్టిగా పనిచేయాలని సీఐ సూచించారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారికి వెండి చెంబు వితరణ

చిట్వేలి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:



స్థానిక పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో పట్టు వస్త్రాలతో దేదీప్యమానంగా అర్చకులు మృత్యుంజయ అలంకరించారు. పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు రాహుకాల సమయంలో దీపాలను వెలిగించారు. స్థానిక గ్రామానికి చెందిన కాళీదేవి శంకర్ రాజ ధర్మపత్ని ఉషారాణి కుటుంబ సభ్యులు వెండి చెంబును వితరణగా ఇచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి

## జీపాలెంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

రేణిగుంట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



రేణిగుంట మండలం జీపాలెం గ్రామంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ స్టార్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆయన కుమార్తె డాక్టర్ నీల కృష్ణవేణి, అల్లుడు ప్రవీణ్ కుమార్ పేర్లతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రాధిక సంగీత కచేరీ, సాయంత్రం అన్నమయ్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో హరికథా గాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్టార్ కృష్ణ దంపతులు కార్వేటినగరం శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి సాంబశివ, రాజశేఖర్, చెంగలరాయులు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా రేణిగుంట పట్టణ పంచాయతీ కార్యాలయంలో తిరుపతి ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో అద్భుతంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు సాంప్రదాయపద్ధంగా బుడిబుడి అడుగులతో కృష్ణయ్య వచ్చాడా అనే అనుభూతి కలిగిస్తూ నిర్వహించారు.. రేణిగుంట బస్టాండ్ సర్కిల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీఆర్ రావణన్, టిడిపి యువనేత ఎం జి రెడ్డి, రేణిగుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్ రాయల్ తదితరులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు

## హరినాథ్ యాదవ్ మృతికి పవిత్ర రెడ్డి నివాళి

రేణిగుంట సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



అత్తూరు పంచాయతీ మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నాయకులు హరినాథ్ యాదవ్ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛా యలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. హరినాథ్ యాదవ్ పార్థివదేహాన్ని సందర్శించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి పూలమాల వేసినివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా హరినాథ్ యాదవ్తో తమకున్న అనుబంధాన్ని పలువురు గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. హరినాథ్ యాదవ్ మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో వైసీపీ రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, వైసీపీ సీనియర్ నాయకులు అత్తూరు హరిప్రసాద్ రెడ్డి, జువ్వల దయాకర రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## వాడవాడలాశ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పుత్తూరురూరల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని పలు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఆల యాల్లో, అలాగే మండలంలోని ముత్తరాసి కండ్రిగలో శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు, అలంకరణలు, అర్చనలు చేశారు. ఆలయ ఆవరణలో విఘ్నేశ్వర పూజ, గణపతి పూజ, ప్రత్యేక హోమాలు చేసి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చి పూజలుచేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుగా నాగరాజు, చంద్రశేఖర్‌రాజు

వడమాలపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:



ఉత్తమ ఉపాధ్యాయులుగా నాగరాజు, చంద్రశేఖర్‌రాజులు ఎంపికైనట్లు వడమాలపేట ఎంఈవో పద్మావతి తెలిపారు. అలాగే సీతారామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముని మోహన్ కూడా ఉత్తమ హెచ్ఎం అవార్డుకు ఎంపికయ్యారు. వడమాలపేట మండలం సీతారామపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఎస్.నాగరాజు మూడు దశాబ్దాలుగా విద్యా రంగానికి విశిష్ట సేవలు అందించారు. ఏడాది పొడవునా విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా పరికరాలు అందించడంతఓ పాటు ఏటా ఉచితంగా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువ చేసే దుస్తులు కూడా అందజేస్తున్నారు. సెలవుల సమయాల్లో కూడా విద్యార్థుల ప్రగతిని ప్రతిరోజు పరీక్షిస్తూ తల్లిదండ్రుల వాట్సాప్ గ్రూపు ద్వారా పిల్లల చదువుల స్థాయి పెరుగుదలకు కృషి చేశారు. ప్రత్యేకంగా ఆయన విద్యారంగంలో అంగన్‌వాడీ నుంచి వచ్చే విద్యార్థులకు ఒకవైపు ప్రభుత్వం రెడీనేస్ ప్రోగ్రాంఏర్పాటు చేయగా ఈ ఉపాధ్యాయుడు ప్రత్యేకంగా పిల్లలకు జీరో కాన్సెప్ట్ ప్లేవే మెథడ్‌నుపరిచయం చేశారు. వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న చంద్రశేఖర్‌రాజు పాఠశాల విద్యార్థులను క్రీడలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లి పలు పతకాలు సాధించడానికి కృషి చేశారు. ఆయన సేవలను అధికారులు గుర్తించడంతో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డుకు ఎంపిక చేశారు. వీరికి శనివారం జిల్లా కలెక్టర్, డీఈవో చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ముగ్గురు ఎంపిక

విజయపురం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్స రంఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జరుగుతుంది. ఇందుకు మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న గాదిరాజు సురలక్ష్మి, మంగళం న్యూ ఎంపీపీ పాఠశాలలోపని చేస్తున్న శ్రీనివాసులు, ఆలపాకం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు భాగ్యరాజులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల వంద శాతం నమోదుకు విద్యాభివృద్ధికి, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవోలు శ్యామల, శ్రీనివాసులు పేర్కొన్నారు. వీరి ఎంపిక పట్ల ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు, రత్నమ్మ, దొరైరాజు, ఉపాధ్యాయులు, సురేష్, సుబ్రహ్మణ్యం అభినందించారు.

## అందరికీ ఆత్మబంధువు, అపద్బాంధవుడు జింపెక్స్ అధినేత ఆర్‌ఎస్ గోయింకా

### నేడు రాజ్ కన్వెన్షన్‌లో సంస్మరణ సభ

రైల్వే కోడూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త.



ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడు, అందరికీ ఆత్మబంధువుగా ఉండి దూరమైన జింపెక్స్ అధినేత ఆర్ఎస్ గోయింకాకు శనివారం రైల్వే కోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ హాలులో ప్రముఖ పారిశ్రామికవేత్త జింపెక్స్ కంపెనీకి కుడి భుజం అయిన మాచినేని విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన ఆత్మకు శాంతిని చేకూర్చేందుకు భారీ స్థాయిలో సంస్మరణ సభ నిర్వహించనున్నారు. స్వర్గీయులు ఆర్ఎస్ గోయింకా 1954లో తమిళనాడులో జన్మించారు. ఆయన గ్రాడ్యుయేషన్ విద్య ప్రారంభంలోనే వ్యాపారం పట్ల ఆసక్తి చూపి 18వ ఏటనే వ్యాపారరీత్యా నాటి కడప జిల్లా,నిన్నటి అన్నమయ్య జిల్లా, నేటి తిరుపతి జిల్లా అయిన రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఓబుళవారిపల్లి మండలం మంగంపేట ముగ్గురాయి వ్యాపారంలో ఆయన అడుగు పెట్టారు. నేటికీ సుమారు 54 సంవత్సరాల పాటు మంగంపేట ముగ్గురాయి వ్యాపారాన్ని కొనసాగించారు. అయితే ఈయనతో పాటు అనేకమంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు మంగంపేటలో వ్యాపార రీత్యా వచ్చారు. అయితే ఈ వ్యాపారుల్లో అధిక శాతం కడప జిల్లాకు చెందిన వారే ఉండేవారు. వారిలో ఎంతో స్నేహభావంతో చిన్న వయసు నుంచే వారిపట్ల అనుకూలతగా మెలుగుతూ వారితో సమానమైన సత్సంబంధాలు కలిగిన, పోటీ తత్వం వ్యాపారాన్ని గోయింకా కొనసాగించారు. నాటి నుంచి నేటి వరకు వ్యాపారం పట్ల 50 శాతం శ్రద్ధ పెడితే పేద బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతి కోసం, తోటి వ్యాపారుల అభివృద్ధి కోసం ఎంతో పాటుపడుతూ తనవంతు కృషి చేసి అందరిని ఆకట్టుకునే ఏకైక ఆత్మబంధువుగా ప్రజల్లోనూ, వ్యాపారుల్లోనూ నిలిచిన అత్యంత ప్రముఖ పారిశ్రామికవేత్త జింపెక్స్ కంపెనీ అధినేత డైరెక్టర్ అయిన ఆర్ఎస్ గోయింకా మరణం రైల్వే కోడూరు నియోజకవర్గం, కడప, తిరుపతి జిల్లాల్లోనే వ్యాపారులకు, ప్రజలకు ఆయన మృతి తీరని లోటునే మిగిల్చిందని చెప్పవచ్చు. ఎవరు ఆపదలో ఉండి ఆశ్రయం కోరితే తన శక్తి మేర ఆర్థిక సాయం చేసి అపర ఆపద్బాంధవుడుగా అందరి గుండెల్లో నిలిచిన ఆత్మబంధువే ఆర్ఎస్ గోయింకా.ఈయన నియోజకవర్గంలోనే కాకుండా రెండు మూడు జిల్లాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ అనేక ప్రాంతాలలో గుడులను నిర్మించి ఆయనకున్న గొప్ప దైవభక్తిని చాటుకున్న ఘనత కూడా గోయింకాదే. ఏపీఎండిసి సంస్థ ద్వారా అనేకమంది వ్యాపారులు వ్యాపారం చేసుకుని అత్యధిక లాభాలను పొంది సమస్త నష్టాల బాటలో ఉన్నప్పుడు అటువైపు కన్నెత్తి చూడకుండా ఎవరి దారి వాళ్ల లాభాల బాటలో చూసుకున్నారు. 2015 16 సంవత్సరాల లో ఏపీ ఎం డి సి సంస్థ మంగంపేటలో పనిచేసే కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితుల్లో కూడా లేకుండా నష్టాల్లో ఉంది. అలాంటి పరిస్థితుల్లో జింపెక్స్ అధినేత ఆర్ఎస్ గోయింకా తల్లి లాంటి సంస్థ బాగుంటే బిడ్డలాంటి వ్యాపారులు అభివృద్ధికి ఎంతో తోడ్పాటును ఇస్తుందన్న యోచనతో విశ్వేశ్వరరావు సారథ్యంలో వెనుక ముందు ఆలోచించకుండా సంస్థ కార్మికులకు జీతాలు ఇచ్చి ఆదుకునేందుకు జిమ్పెక్స్ అధినేత ఆర్ఎస్ గోయింకా ముందుకు వచ్చి ఐదు నెలల పాటు సంస్థ కార్మికులకు, ఖనిజ ఉత్పత్తికి ఆర్థికపరమైన తోడ్పాటును ఇచ్చి ఆదుకున్న గొప్ప దాత కూడా ఆర్ఎస్ గోయింకానని చెప్పవచ్చు.

# తిరుపతి డివిజన్

## కొత్తూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం చిగు రువాడ గ్రామ పంచాయతీ పరిధి లోని కొత్తూరులో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ దేవాలయం ఆధ్యాత్మిక కాంతులతో కళకళ లాడింది. ఉదయం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, గోపూజ కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శన భాగ్యాన్ని పొందారు. అనంతరం నిర్వహించిన కళ్యాణోత్సవం భక్తులను ఆకట్టుకుని కన్నులపండువుగా నిలిచింది. మధ్యాహ్నాం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం యువత ఉట్లోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని గ్రామ ఊరేగింపు చేశారు. రాత్రి ఊంజల్ సేవతో వేడుకలు మరింత ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వార్తాల శివ యాదవ్, శ్రీనివాస యాదవ్, వెంకట్రామయ్య యాదవ్, బాలసుబ్రమణ్యం యాదవ్, నాగరాజు యాదవ్, మునిస్వామి యాదవ్, మురళియాదవ్,భాస్కర్ యాదవ్, చెంచురామయ్య యాదవ్, నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో భక్తుల రక్షణ రద్దీ నియంత్రణకు పటిష్ట చర్యలు

–జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారి సాలకట్ల ఔనవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలకు విచ్చేసే భక్తుల భద్రత రద్దీ ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై, భద్రతాచర్యలపై శుక్రవారం సాయంత్రం ఎస్పీ సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ,తిరుమల ఎఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఓ సురేంద్రతో కలసి మాఢవీధుల్లో పరిశీలించారు. తిరుమలలోని రింగ్ రోడ్డు, కీలక ట్రాఫిక్ జంక్షన్లు, భక్తుల రాకపోకల మార్గాలు తదితర ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని, ముఖ్యంగా క్రౌడ్ మేనేజ్‌మెంట్ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ పరిధిలో సమర్థవంతమైన సేవలు అందించేందుకు కంట్రోల్ రూమ్‌లు, సబ్ కంట్రోల్ రూమ్‌లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. తిరుమలలో పార్కింగ్ స్థలం పరిమితంగా ఉండటంతో సుమారు 3వేల వాహనాలకు మాత్రమే పార్కింగ్ అవకాశం ఉందని తెలిపారు. పార్కింగ్‌ను పద్ధతిగా నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో కొన్ని ప్రాంతాలను గుర్తించి ప్రైవేట్, ఎల్లో బోర్డు వాహనాలను అక్కడే నిలిపేలా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.తిరుపతిలో వాహనాలను నిలిపే భక్తులు అక్కడి నుండి ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు చేరుకుని, దర్శనం అనంతరం తిరిగి వెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడ సేవ సందర్భంగా ద్విచక్ర వాహనాలు, ప్రైవేట్ వాహనాల రాకపోకలకు ఎక్కడి వరకు అనుమతి ఉంటుంది, ఎప్పటి నుండి పరిమితులు విధిస్తారు అనే అంశాలపై త్వరలో ప్రత్యేకంగా పూర్తి వివరాలను మీడియా ద్వారా వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు. పోలీసు, టీటీడీ అధికారులు ఇచ్చే సూచనలను భక్తులు తప్పనిసరిగా పాటించి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా, సురక్షి తంగా నిర్వహించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి ఉత్సవాలు

–వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ పిలుపు

తిరుపతి,సెప్టెంబర్ 4ప్రభాతవార్త:



తిరుపతి నగరంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించుకోవాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ పిలుపునిచ్చింది. పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని కమిటీ కన్వీనర్, సభ్యులు కోరారు. శుక్రవారం స్థానిక ఇందిరా మైదానంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో కన్వీనర్, సభ్యులు మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి పర్వదినాన్ని భక్తి, శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని సూచించారు. మొదటి రోజు ఈనెల 14న,మూడవరోజు 16న సామూహిక నిమజ్జనం, 20వ తేదీన ఏడవ రోజు నిమజ్జనాన్ని నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఈ నెల 6న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉత్సవ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించి, వినాయక మండపాల నిర్వాహకులకు అవసరమైన అనుమతులు జారీ చేస్తామని వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా డీజేలు, మద్యం సేవించడం, టపాకాయలు కాల్చడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, శబ్ద కాలుష్యం, అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో పూజలు, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వినాయకుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యాలు నెలకొనాలని ఆకాంక్షి ంచారు. ఈ సమావేశంలో తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, మాంగాటి గోపాల్ రెడ్డి, కరాటే శ్రీనివాస్, భాస్కర్ నాయుడు, కిరణ్, చంద్రశేఖర్, నాగరాజ్, నవీన్, మణి, వాసు, సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రభాకర్ నాయుడు, రామ్‌కుమార్, మురళి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో "వినాయక చవితి" ఉత్సవాలు

### మూడవ రోజు నిమజ్జనం చేయడంపై దృష్టి పెట్టండి :సిఐ

చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



హిందువులకు అత్యంత పవిత్రమైన మొదటి పండుగ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సిఐ సురేష్ కుమార్ అన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు.. స్థానిక ఓ కల్యాణ మండపంలో వినాయక చవితి కమిటీలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగనీయకుండా ప్రణాళిక బద్ధంగా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. విగ్రహ ఏర్పాటు, విద్యుత్ దీపాలంకరణ, పందిరి ఏర్పాటులో ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉత్సవాలను మూడు రోజులకు పరిమితం చేస్తూ 14న వినాయక చవితి, 16న నిమజ్జనం చేసుకునే విధంగా ప్రణాళిక వేసుకోవాలన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాల రీత్యా పోలీసు బలగాలు తిరుమలకు వెళుతున్నందున ఉత్సవ కమిటీలు సహకరించాలన్నారు. ఉత్సవాలలో మద్యం సేవించడం, డిజెలు, రికార్డ్ డ్యాన్సులు, భాణాసంఛా పేల్చడం వంటివి నిషేధించినట్లు తెలిపారు. ఉత్సవ కమిటీల తరపున వినాయకచవితి వేడుకలు జరుపుకునేందుకు పోలీసు అనుమతి తీసుకోవాలనీ, ఆ మేరకు మీకు నిబంధనల ప్రతితో పాటు దరఖాస్తును అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణాచలం, విద్యుత్‌శాఖ ఏఈ నాగరాజు, ఇరిగేషన్ ఏఈ సుధీప్ రెడ్డి, చంద్రగిరి పరిసర పంచాయతీల ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

మండల పరిధిలోని పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లి, చంద్రగిరి కృష్ణమందిరం, తొండవాడ కృష్ణ మందిరంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను అంరంగ వైభవంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, విద్యుద్దీపకాంతులతో ఆలయాలను ముస్తాబు చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపారు. ఆలయంలోని మూలవిరాట్‌తో పాటు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను విశేష అలంకరణలతో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7.30 గంటలకు గోపూజ, 11 గంటలకు కళ్యాణోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు గ్రామవీధులలో ఊరేగింపు నిర్వహించారు.

# స్విమ్స్‌కు ప్రతిష్టాత్మక గౌరవం

**– ఇద్దరు వైద్య అధ్యాపకులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు**
**– సెప్టెంబర్ 5న విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**
**చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్న ప్రొఫెసర్ డా. వై. ముత్తీశ్వరయ్య, ప్రొఫెసర్ డా. బి. మణిలాల్**

**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

వైద్య విద్య, రోగసేవ, పరిశోధన, అకడమిక్ నాయకత్వంలో స్విమ్స్ అత్యున్నత ప్రమాణాలకు లభించిన ప్రతిష్ఠాత్మక గుర్తింపు వస్తుందని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), తిరు పతికి రాష్ట్రస్థాయిలో మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026 సంవత్సరానికి ప్రకటించిన రాష్ట్రస్థా యి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు స్విమ్స్‌కు చెందిన ఇద్దరు సీనియర్ వైద్య అధ్యాపకులు ఎంపికయ్యారు. స్విమ్స్ జనరల్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. వై. ముత్తీశ్వరయ్య, సర్జికల్ ఆంకాలజీ విభాగం ప్రొఫెసర్ డా. బి. మణిలాల్ వైద్య విద్య, రోగసేవ, అకడమిక్ రంగం, భావితరాల వైద్యులకు మార్గదర్శకత్వం అందించడంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 5న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వీరు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ ఇద్దరు అవార్డు గ్రహీతలను ప్రత్యే కంగా అభినందిస్తూ, ఇది స్విమ్స్ కుటుంబం మొత్తానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గొప్ప వైద్య ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాలను బోధించడానికే పరిమితం కారు. భావితరాల వైద్యుల్లో వైద్య విజ్ఞానం, క్లినికల్ నిర్ణయ సామర్థ్యం, వృత్తిపరమైన నైతిక విలువలు, రోగుల పట్ల కరుణ, సామాజిక బాధ్యతలను పెంపొందించే గురువు. స్విమ్స్‌కు చెందిన ఇద్దరు విశిష్ట అధ్యాపకులు ఒకే




సంవత్సరంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావడం మా సంస్థకు ఎంతో గర్వకారణమ న్నారు.

**రెండు దశాబ్దాలకు పైగా వైద్య విద్య, శస్త్రచికిత్స రంగాల్లో ప్రొఫెసర్ డా. వై. ముత్తీశ్వరయ్య విశిష్ట సేవలు**

ప్రొఫెసర్ డా. వై. ముత్తీశ్వరయ్య 2005 జనవరి 1వ తేదీన స్విమ్స్ జనరల్ సర్జరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తన సేవలను ప్రారంభించారు. వైద్య విద్య, క్లినికల్ సేవలు, పరిశోధన రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ వివిధ స్థాయిల్లో సేవలందించి 2010లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2012 నుంచి ఇప్పటి వరకు జనరల్ సర్జరీ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తూ విభాగ అభివృద్ధితో పాటు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల బోధన, శిక్షణలో విశేష కృషి చేస్తున్నారు. శ్రీ పద్మావతి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహించి వైద్య విద్యార్థుల అకడమిక్ పురోగతి, క్రమశిక్షణ, వైద్య విద్యా ప్రమాణాల మెరుగుదలకు విశేష కృషి చేశారు.

**క్యాన్సర్ రోగసేవ-వైద్య బోధనలో ప్రొఫెసర్ డా. బి. మణిలాల్ విశేష కృషి**

ప్రొఫెసర్ డా. బి. మణిలాల్ ప్రస్తుతం స్విమ్స్ సర్జికల్ ఆంకాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ఆయన 2009లో సర్జికల్ ఆంకాలజీ విభాగంలో సీనియర్ రెసిడెంట్‌గా స్విమ్స్‌లో తన వైద్య ప్రస్థానాన్ని ప్రారంభించారు. వృత్తిపరమైన ప్రతిభ, అనుభవం, నిరంతర అధ్యయనం, అంకితభావంతో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ స్థాయిల్లో సేవలందించి 2023లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆంకాలజీ రంగంలో 17 సంవత్సరాలకు పైగా క్లినికల్ అనుభవం కలిగిన డా. మణిలాల్ క్యాన్సర్ రోగులకు సమగ్రమైన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన శస్త్రచికిత్స సేవలను అందించడంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధితో పోరాడుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యుల పట్ల మానవతా దృక్పథం, సానుభూతి, అంకితభావంతో సేవలందిస్తూ వైద్యసేవలో ఆదర్శంగా నిలుస్తున్నారు. క్లినికల్ సేవలతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, యువ వైద్యులకు సర్జికల్ ఆంకాలజీలో ఆధునిక చికిత్సా విధానాలు, శస్త్రచికిత్స నైపుణ్యాలపై నిరంతరం బోధన, శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపికైన ప్రొఫెసర్ డా. వై. ముత్తీశ్వరయ్య, ప్రొఫెసర్ డా. బి. మణిలాల్‌లను స్విమ్స్ డీన్, ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెండెంట్, విభాగాధిపతులు, అధ్యాపకులు, వైద్యులు, పీజీ విద్యార్థులు, నర్సింగ్, ఇతర సిబ్బంది హృదయపూర్వకంగా అభినందించారు.

## ఎస్ వి వైద్య కళాశాల, ప్రసూతి ఆసుపత్రిలో
### క్లిష్టమైన సర్వికల్ ఫైబ్రాయిడ్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స




**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

ఎస్‌వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు ఆధ్వర్యంలో ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ప్రమీలాదేవి పర్యవేక్షణలో మోలా బీ, వయసు సుమారు 54 సంవత్సరాల మహిళకు మొలకలచెరువు గ్రామానికి చెందిన, వాసికి క్లిష్టమైన సర్వికల్ ఫైబ్రాయిడ్ (గర్భాశయ ముఖద్వార కణితి)కు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. ప్రమీలాదేవి టోటల్ అబ్డామినల్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గర్భాశయ ముఖద్వారంలో ఏర్పడే ఫైబ్రాయిడ్‌లు శస్త్రచికిత్స పరంగా సవాలుతో కూడుకున్నవి. వైద్య బృందం సమన్వయంతో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. రోగి ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. ఈ శస్త్రచికిత్సకు డాక్టర్ బి. సంధ్య, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ ఎ. మధులిక, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ ఎస్. సంధ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సహాయ సహకారాలు అందించారు. శస్త్రచికిత్సకు అనస్థీషియా విభాగం నుంచి డాక్టర్ టి. పద్మ, హెచ్‌ఒడి, డాక్టర్ విజయభాస్కర్, ప్రొఫెసర్, డాక్టర్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ దొరబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సహకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. ప్రమీలాదేవి శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు, అనస్థీషియా బృందం, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర సిబ్బందిని అభినందించారు.

## ఏసీబీ దాడులను రాజకీయం చేయొద్దు
**– జనసేన తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్**



**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

సెప్టెంబర్ 2న తిరుమలలో పనిచేస్తున్న డిప్యూటీ ఈవో లోకనాథం అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని వారి ఇంట్లో, వారి బంధువులు, అనుచరుల ఇంట్లో ఏకకాలంలో ఏసీబీ దాడులు జరిపి, అతడిని అరెస్టు చేశారని, డిప్యూటీ ఈవో లోకనాథమును అరెస్టు చేస్తే భూమునకు ఉలుకెందుకని కిరణ్ రాయల్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగస్తులు గత ప్రభుత్వంలో కొంతమంది అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కూడా పెట్టారని, లోకనాథంతో పాటు టీటీడీలో పనిచేస్తున్న ఇంకా కొంతమంది ఉద్యోగస్తులు ఈ జాబితాలో ఉన్నారని కొంత మంది అధికారుల చిట్టా తన దగ్గర ఉందని, తొందరలో విచారణ జరిపి అరెస్టు చేస్తారని, టీటీడీ ఉద్యోగస్తులను అక్రమ ఆస్తుల కేసులో అరెస్టు చేస్తే భూమున కరుణాకర్ రెడ్డి వారికి వత్తాసు పలకడం ఏంటని ప్రశ్నించారు. వారికి భూమన మద్దతు పలకడం ఏంటి? అన్నారు. ఇది ప్రభుత్వం చేస్తున్న దాడులే కానీ, వ్యక్తిగత దాడులు కాదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీసీ ఓటర్ల మద్దతు కోసం భూమన ఆడుతున్న డ్రామా అని, కరుణాకర్ రెడ్డి కులాల మధ్య చిచ్చుపెట్టి, కుల రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. తిరుపతి ప్రజలు టీటీడీ ఉద్యోగస్తులు భూమన ట్రాప్‌లో పడవద్దని, ఏసీబీ దాడులను రాజకీయం చేయొద్దని కిరణ్ రాయల్ కోరారు. టీడీలో గత ప్రభుత్వంలో పని చేసిన ఆఫీసర్స్ అందరినీ బదిలీ చేయాలని, లేకపోతే ఇటువంటి ఆరోపణలు చేస్తూ ఉంటారని కిరణ్ రాయల్ టీటీడీ ఈవో, ఛైర్మన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మనోజ్, సాయి, పురుషోత్తం, ముని, రాహుల్ పాల్గొన్నారు.

## రామాపురంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**పెద్దపంజాణి, సెప్టెంబర్4 ప్రభాతవార్త:**

మండలంలోని నెర్నిపల్లి పంచాయతీ రామాపురం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమివేడుకలను శుక్రవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ ముఖ్యఅథితులుగా హాజరై స్వామివారి విగ్రహానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## గీతా సారాన్ని జీవితంలో ఆచరించాలి
**ధర్మం, సత్యం కోసం నిలబడాలి: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి విద్య సెప్టెంబర్ 4 ప్రభాత వార్త**



భగవద్గీత ద్వారా శ్రీకృష్ణ పరమాత్మ అందించిన జీవన విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ధర్మాన్ని కాపాడటం, సత్యం కోసం నిలబడటం, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవడం వంటి గొప్ప విలువలను శ్రీకృష్ణుడు మానవాళికి బోధించారని తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుక్రవారం ఇస్కాన్ ఆలయంలో రాధాసమేత శ్రీకృష్ణ పరమాత్మను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని సందేశం కేవలం భక్తికి మాత్రమే పరిమితం కాదని, నిత్య జీవితంలో మనిషి ఏ విధంగా నడుచుకోవాలో మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో శాంతి, సహనం, మానవత్వం మరింత అవసరమని అన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఓర్పుతో ముందుకు సాగేందుకు భగవద్గీత స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ గీతా బోధనలను జీవితంలో అనుసరిస్తే సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చున్నారు. అనంతరం కపిలతీర్థం సమీపంలోని హరేకృష్ణ మందిరాన్ని కూడా ఎమ్మెల్యే సతీసమేతంగా సందర్శించి శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకున్నారు. ఆలయ ప్రతినిధులు రేవతి రమణ ప్రభు, లీలా పారాయణ దాస్, హరేకృష్ణ మందిరం ప్రతినిధి ప్రేమ ప్రభుదాస్ తదితరులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తమ్మినేని వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, హరిశంకర్, జీవకోన సుధా, సతీష్, హరీష్, దినేష్ జైన్, ఆళ్వార్ మురళీ, ప్రభాకర్ రెడ్డి, కొండా రాజమోహన్, రమేష్ నాయుడు, బొజ్జా మణి, హరి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భీమన్నకు సన్మానం



**తిరుపతి విద్య సెప్టెంబర్ 4 ప్రభాత వార్త**

టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ భీమన్నను వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యా అవకాశాల కల్పన, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. విద్యార్థుల హక్కులు, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారికి అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు. కళాశాల మరింత అభివృద్ధి సాధించేలా నూతన ప్రిన్సిపల్ నాయకత్వంలో చర్యలు తీసుకోవాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా డాక్టర్ భీమన్నకు విద్యార్థి సంఘాల నాయకులు అభినందనలు తెలియజేస్తూ, కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భవిష్యత్ అవకాశాలను మెరుగుపరిచే దిశగా కళాశాల ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారతీయ దళిత విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా యుగంధర్, బీమ్ స్టూడెంట్ ఫోర్స్‌కు చెందిన కేవీ కృష్ణ మాదిగ, బీజేఆర్‌ఎస్‌ఎఫ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు కేఎం అర్జున్, వాల్మీకి విద్యార్థి సంఘం అధ్యక్షురాలు వినుత, ఆర్‌డీఎస్‌ఎఫ్ రాయలసీమ అధ్యక్షుడు జగదీష్, నేషనల్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే నేరుగా జైలుకే..
**– వినాయక చవితి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి**
**– డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ సిఐ మంజునాథరెడ్డి**



**రేణిగుంట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

రేణిగుంట మండలం, రేణిగుంట రూరల్ పరిధిలోని గాజుల మండ్యం పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి మండపాల నిర్వాహకులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మంజునాథ్ రెడ్డి సమావేశం నిర్వహించారు. మండపాల ఏర్పాటుకు గణేష్ ఉత్సవ్ నెట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకుంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన అనుమతి పత్రం (ఎన్‌ఓసి) ఇస్తామని తెలిపారు. మండపాల వద్ద ఊరేగింపులో డీజేలు, అసభ్యకర ప్రదర్శనలకు అనుమతి లేదని, నిర్ణయించిన మార్గాల్లోనే నిమజ్జనం సాగాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనరాదని హెచ్చరించారు. భద్రత కోసం సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి వినాయక మండపంపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. మహిళలను వృద్ధులను చిన్నపిల్లలను వేధిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. డీజేలు రికార్డింగ్ డాన్సులు ఏర్పాటు చేస్తే నేరుగా జైలుకే పంపిస్తామన్నారు. ఈ తప్ప తాగి అల్లర్లు చేస్తే కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాలమన్నారు. కార్యక్రమంలో రైటర్ మణి, పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వినియోగదారుల హక్కుల కోసం పోరాటం
**విజయ్ ఉత్తరాది**




**తిరుపతి విద్య సెప్టెంబర్ 4 ప్రభాత వార్త**

కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ (సీఆర్‌సీ) స్టేట్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా విజయ్ ఉత్తరాది నియమితులయ్యారు. సీఆర్‌సీ జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో విజయ్ ఉత్తరాదికి నూతన బాధ్యతలను అధికారికంగా అప్పగించారు. వినియోగదారుల హక్కులను కాపాడటంతో పాటు, వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని విజయ్ ఉత్తరాది తెలిపారు. మార్కెట్‌లో నాణ్యత లేని వస్తువులు, సేవల్లో లోపాలు, అధిక ధరలు, మోసపూరిత విధానాల కారణంగా వినియోగదారులు నష్టపోకుండా వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులకు అన్యాయం జరిగిన ప్రతి సందర్భంలో వారి తరఫున ప్రశ్నిస్తామని, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. బాధిత వినియోగదారులకు న్యాయం జరిగే వరకు అండగా నిలిచి పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణపై మరింత చైతన్యం తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని విజయ్ ఉత్తరాది పేర్కొన్నారు.

## ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాలలో 230 డిస్టింక్షన్లు
**ఉత్తమ ఫలితాలతో సత్తాచాటిన విద్యార్థులు**


C.BHAVANA (B OTECH)


T RESHMA (BCA AI)


K.UMA (BCA A &DS)


C.G RIJA EKAMBARAM (BCA)


MVL SAI SUMANASWIN (BC OM)


R.CHANDU PRIYA (BSC CS)

**తిరుపతి విద్య సెప్టెంబర్ 4 ప్రభాత వార్త**

న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాల విద్యార్థులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రకటించిన ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ బీకాం (సీఏ), బీబీఏ, బీసీఏ, బీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వివిధ కోర్సులకు చెందిన 230 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ. ఉష తెలిపారు. బయోటెక్నాలజీ విభాగంలో సి. భావన 9.84, బీసీఏ (ఏఐ) విభాగంలో టి. రేష్మ 9.08, బీసీఏ (ఏఐ అండ్ డీఎస్)లో కుమా 8.82, బీసీఏలో సి. గిరిజా ఏకాంబరం 8.72, బీకాంలో ఎంవీఎల్. సాయి సుమనస్విని 8.65, బీఎస్సీ (సీఎస్)లో ఆర్. చందుప్రియ 8.60, బీబీఏలో ఎస్. సత్యస్పందన 8.51 గ్రేడ్ పాయింట్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డి.వి.ఎస్. చక్రవర్తి రెడ్డి అభినందించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల బోధన, కళాశాల యాజమాన్యం అందించిన ప్రోత్సాహంతోనే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ ఏ. ఉష తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించేలా మరింత ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

## పరిశోధనలో ఘనత.. రాష్ట్రస్థాయిలో గుర్తింపు
**ఎస్వీయూ ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు ఉత్తమ అధ్యాపక పురస్కారం**
**126 పరిశోధనా వ్యాసాలతో ప్రత్యేక గుర్తింపు**
**15 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం**

**తిరుపతి విద్య సెప్టెంబర్ 4 ప్రభాత వార్త**



బోధనతో పాటు పరిశోధన రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక పురస్కారంతో గౌరవించనుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు. విద్యార్థులకు బోధన అందించడంతో పాటు శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహిస్తూ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు విశేష కృషి చేశారు. ఆయన ఇప్పటివరకు రూపొందించిన 126 పరిశోధనా వ్యాసాలు స్కోపస్‌లో నమోదవడం ఆయన పరిశోధనా ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. ఆయన పర్యవేక్షణలో 15 మంది పరిశోధకులు పీహెచ్‌డీ, ఇద్దరు ఎంఫిల్ డిగ్రీలను పూర్తి చేశారు. పలు ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టులను పూర్తి చేసి, జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, కార్యశాలల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ శాస్త్ర పరిశోధనా పత్రికలకు సహ సంపాదకుడిగా, సమీక్షకుడిగా సేవలందిస్తూ పరిశోధన రంగంలో తనదైన ముద్ర వేశారు. ఇప్పటికే ఎస్వీయూ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు-2024, ఇంటర్నేషనల్ సైంటిస్ట్ అవార్డు-2012తో పాటు ఇటీవల రామన్ రీసెర్చ్ ఫౌండేషన్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. విశ్వవిద్యాలయంలోనూ పలు కీలక బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు. హాస్టల్ వార్డెన్, శాస్త్ర ఉపకరణ కేంద్రం డైరెక్టర్, ప్రవేశాల విభాగం సంయుక్త సంచాలకుడు, గవర్నర్ కార్యాలయానికి ఎస్వీయూ తరఫున అనుసంధాన అధికారిగా, ఏపీ రీసెట్ కన్వీనర్, ఏపీ పీజీ సెట్ సహ కన్వీనర్ తదితర బాధ్యతల్లో సేవలందించారు. పరిశోధన, బోధన, పరిపాలనా రంగాల్లో ఆయన అందించిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపిక చేసింది. ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించడంపై ఎస్వీయూఅధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## చిల్లావాండ్ల పల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**చిట్వేలి, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త:**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని చిల్లవాండ్లపల్లి గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు సాయంత్రం స్వామి అమ్మవారికి కళ్యాణాన్ని నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. పిల్లలు పెద్దలు కలిసి నిర్వహించిన కోలాటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని శ్రీకృష్ణుడికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక శ్రీశ్రీ దస్తగిరి నారాయణ తపోవనం నందు భగవద్గీత పారాయణం, భజనలు, కీర్తనలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలరించారు. పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు సందడిగా సాగాయి. శ్రీకృష్ణుని జన్మకథను, ఆయన బోధించిన ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను పెద్దలు పిల్లలకు వివరించారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా మానవాళికి అందించిన సందేశం నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాధాన్యమైనదని పలువురు పేర్కొన్నారు.

